క్లుప్తంగా

అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి



ఎంఈవోలను సన్మానిస్తున్న హెచ్ఎంలు

నక్కపల్లి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఎంఈవోలు కుంచం నరేష్, దొర సూచించారు. శనివారం నక్కపల్లి ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలలకు చెందిన నూతన హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అభ్యసన సామర్థ్యాలను పెంచాలన్నారు. పాఠశాలల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు నివేదిక సమర్పించాలన్నారు. ప్రతి పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఎంఈవోలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



ఇసుక ట్రాక్టర్

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం మునగపాక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో మునగపాక వైపు వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. మండల స్థాయి అధికారుల కో–ఆర్డినేషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అర్జీదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించుకోవాలన్నారు. వివాదాలకు పోకుండా సామరస్యంగా నడుచుకోవాలన్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఎస్ఐ ప్రసాదరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: హౌసింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలను పూర్తి చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంకా ప్రారంభించని వారిని గుర్తించి మొదలెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ జేఈ ప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



వెంకటరావును సన్మానిస్తున్న గ్రామస్తులు

నక్కపల్లి: మండలంలో ముకుందరాజుపేటలో పనిచేసి బదిలీపై వేరే పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయుడిని గ్రామస్తులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం పంపనబోయిన వెంకటరావు బదిలీపై దేవవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన్ను సర్పంచ్ వియ్యపు శ్రీను, ప్రస్తుత హెచ్ఎం నాగరాజు, స్థానిక నాయకులు హరికృష్ణ, దార్ల నాగరాజు, రంగబాబు తదితరులు సన్మానించారు. అంకితభావంతో పనిచేస్తూ మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

పూడిక తీత పనుల నిలిపివేత

ఎస్.రాయవరం: స్థానిక వరాహనదిలో మండల పరిషత్ నిధులతో చేపట్టిన పూడిక తీత పనులు నిలిపివేస్తున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. మూడు రోజులు క్రితం చేపట్టిన ఈ పనుల్లో కాంట్రాక్టర్, ఇరిగేషన్ అధికారులు కలిసి మట్టిని నదిలో నుంచి తొలగించి ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారని గ్రామానికి చెందిన సోమిరెడ్డి రాజు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శనివారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించి ఎంపీడీవోకి నివేదిక ఇచ్చారు. ఈ మేరకు పనులు ఆపివేస్తున్నట్టు ఎంపీడీవో చెప్పారు.

పచ్చని భూముల్లో పరిశ్రమలా?

- పాటిపల్లి పంచాయతీలో 600 ఎకరాల సేకరణకు సర్వే
- అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం
- జీవనాధారం కోల్పోతామని ఆందోళన
- వ్యవసాయం, పాడి దెబ్బతింటుందంటూ ఆవేదన
- న్యాయం చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి అర్జీలు



పాటిపల్లి పంచాయతీ పరిధిలో సర్వే చేస్తున్న భూములు

మునగపాక: ఇంతవరకు ప్రశాంతంగా ఉన్న పాటిపల్లి పంచాయతీలో ఒక్కసారిగా అలజడి రేగింది. ఎటువంటి సమాచారం లేకుండా అధికారులు భూములు సర్వే చేయడంతో ఆందోళనకు గురవుతున్నారు. తమ ప్రాంతంలో కంపెనీ వస్తుందంటూ ప్రచారం జరగడంతో పచ్చని పొలాలు పోతాయని, జీవనాధారం కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో న్యాయం చేయాలని కోరుతూ ఇప్పటికే రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వేడుకున్నారు. ఏళ్ల తరబడి తమ భూములవైపు ఏ ప్రభుత్వమూ చూడలేదని, కూటమి ప్రభుత్వం ఉన్నపళంగా భూముల సర్వే చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

పాటిపల్లి పంచాయతీలో 600 ఎకరాల భూమి సర్వేకు శ్రీకారం...

మండలంలోని పాటిపల్లి పంచాయతీలో 600 ఎకరాల స్థలాన్ని పారిశ్రామిక అవసరాల కోసం గుర్తించారు. ఇందుకోసం సంబంధిత స్థలాన్ని సర్వేయర్లు సర్వే చేపట్టారు. సర్వే నంబర్లు 79, 112, 113 లలో ఎవరెవరు సాగులో ఉంటున్నారు, ఎంత మేర ప్రభుత్వ భూములున్నాయి, జిరాయితీ భూములు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే వివరాలతో కూడిన సర్వేను అధికారులు దాదాపుగా పూర్తి చేశారు.

సర్వేతో ప్రజల ఆందోళన..

తమ ప్రాంతంలోని భూములను సర్వే చేపట్టడంతో ఏం జరుగుతుందోనని పాటిపల్లి పంచాయతీ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పంచాయతీ ప్రజలు పాడితోపాటు వ్యవసాయం సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే పచ్చని పొలాలు, పాడి కోల్పోయే పరిస్థితులు ఉన్నాయని గుర్తించి ఏం చేయాలో తెలియక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తమ ప్రాంతంలో పరిశ్రమలు వద్దంటూ న్యాయం చేయాలని కోరుతూ ఇప్పటికే



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పాటిపల్లి పంచాయతీ ప్రజలు(ఫైల్)

ప్రజలు అటు రెవెన్యూ అధికారులకు ఇటు కలెక్టర్ కార్యాలయానికి వినతులు అందజేశారు. పచ్చని ప్రదేశంలో కాలుష్య రహిత పరిశ్రమలు వస్తే తమ జీవన పరిస్థితులు ఏంటంటూ ఆవేదనకు గురవుతున్నారు.

జిరాయితీలు ఇచ్చేది లేదు...

పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం భూములను సేకరించడం సరే, ప్రభుత్వ భూములను తీసుకోవాలే కాని జిరాయితీ భూములను ఎందుకు ఇస్తామంటూ పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అవసరమనుకుంటే డీ–ఫారం భూములను తీసుకోవాలని, అంతేకాని జిరాయితీ భూముల జోలికి రావద్దంటూ కోరుతున్నారు.

గ్రామసభలు నిర్వహించకుండా సర్వేనా..

ఎక్కడైనా ప్రభుత్వం భూములను సేకరించాలనుకుంటే తప్పనిసరిగా సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది. ఎందుకు భూములను సర్వే చేయిస్తున్నామనే వివరాలు ముందుగా గ్రామసభలో రైతులు, ప్రజలకు వెల్లడించాలి. అందరి ఆమోదంతో తీర్మానం చేసుకొని సర్వే పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ఇవేమీ పట్టించుకోకుండా అధికారులు గ్రామంలో సర్వే చేపట్టడం సరికాదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీ–ఫారం భూములను తీసుకోవాలి



ప్రభుత్వం భూములను సేకరించే పరిస్థితుల్లో తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలి. ఇంతవరకు సభలు నిర్వహించలేదు. అయినా సర్వే చేపట్టారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే పరిశ్రమలు రావడం మంచిది కాదు. కాలుష్య కారక పరిశ్రమలు అయితే ఎవరూ సమ్మతించరు. ఒకవేళ భూములను సేకరించాలని అనుకుంటే జిరాయితీ వదిలేసి డీ–ఫారం భూములను తీసుకోవాలి. అధికారులు ఆదిశగా ఆలోచించాలి.

– ఇల్లా శిరీషా, ఎంపీటీసీ, పాటిపల్లి

భూములు సేకరిస్తే ప్రజామోదం తీసుకుంటాం



పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం భూ సర్వే చేపడుతోంది. రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గంలోనూ ప్రభుత్వ భూముల సర్వే జరుగుతోంది. ఇక్కడా పాటిపల్లి పంచాయతీ పరిధిలో సర్వే చేసి ప్రభుత్వ భూమి, జిరాయితీ ఎంతమేర ఉందో గుర్తిస్తాం. సంబంధిత నివేదికను ప్రభుత్వానికి పంపుతాం. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సి వస్తే తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి ప్రజల ఆమోదం పొందాకే ముందుకు కదులుతాం. ఎవరూ అపోహలకు పోరాదు.

– పి.సత్యనారాయణ, తహసీల్దార్, మునగపాక

టీడీఆర్‌లకు వ్యతిరేకంగా పాదయాత్ర రేపు

అచ్యుతాపురం: టీడీఆర్‌లను కట్టబెట్టే యత్నాలపై పోరాడేందుకు గానూ ఈ నెల 28న హరిపాలెం నుంచి కలెక్టరేట్ వరకూ పాదయాత్ర నిర్వహిస్తున్నామని నిర్వాసితుల సంఘం కో కన్వీనర్ కే.రామసదాశివరావు తెలిపారు. శనివారం హరిపాలెంలో నిర్వాసితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్యుతాపురం–అనకాపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు, షాపులు కోల్పోతున్న వారికి పరిహారం ఇవ్వాలన్నారు. అంతేగానీ ప్రభుత్వం కుట్ర పూరితంగా వీఎంఆర్‌డీఏ ద్వారా టీడీఆర్ బాండ్లు ఇచ్చి మోసం చేసే ప్రయత్నాలు తగదన్నారు. వీటి వల్ల మధ్యవర్తులకు, బిల్డర్లకు మేలు జరుగుతుందని, నిర్వాసితులకు కాదని తెలిపారు. 1200 మంది నిర్వాసితులకు రూ.400 కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ టీడీఆర్‌లు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. తక్షణమే 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆర్.రాము, కర్రి అప్పారావు, ఎస్.బ్రహ్మాజీ, కూండ్రపు సోమునాయుడు, కన్నుంనాయుడు, బుద్ధ రంగారావు, బాబూరావు, ఆడారి శ్రీనివాస్‌నాయుడు, బొడ్డేడ సూరి చంద్రరావు, కాండ్రేగుల నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న రామసదాశివరావు

మాదక ద్రవ్యాల అనర్థాలపై చిత్ర ప్రదర్శన



చలనచిత్రాన్ని తిలకిస్తున్న విద్యార్థులు

కె.కోటపాడు: కె.కోటపాడు డీపీఎస్ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వ్యాన్‌పై చలనచిత్రాన్ని ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా చట్టాలు, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.జె.వి.ప్రసాద్, బి.అప్పారావు, శ్రీనివాసరావు, మానస, రామారావు, పీడీలు వి.ప్రభాకరరావు, పి.కమల పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



కొల్లు మోహన్

కె.కోటపాడు: మండలంలోని తాళ్లపాలెం గాయత్రి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. ఈ ఏడాది టెన్త్‌లో ఉత్తమ మార్కు లతో ఉత్తీర్ణుడైన కొల్లు మోహన్ ఒంగోలులోని ఏపీ ఆర్‌జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించాడు. ఈ సందర్భంగా శనివారం మోహన్‌ను స్కూల్ యాజమాన్యం, హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వెంగమాంబ క్వారీలో అక్రమ మైనింగ్

అనకాపల్లి: మండలంలో సహజ సంపదైన క్వారీలను కూటమి ప్రభుత్వం దోచుకుని కోట్లాది రూపాయలు ఆర్జిస్తోందని, మైనింగ్ అధికారులు ఇప్పటికైనా మొద్దునిద్ర విడనాడాలని సీపీఐ మండల కార్యదర్శి వియ్యపు రాజు అన్నారు. సీతానగరం రెవెన్యూ పరిధిలోని వెంగమాంబ క్వారీని శనివారం ఆయన పరిశీలించారు. ఈ క్వారీ క్రషర్ల లీజు ముగిసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా కూటమి నేతలు దీనిని నడుపుతున్నారన్నారు. క్వారీల కారణంగా తాగునీరు లేక, పీల్చడానికి పరిశుభ్రమైన గాలి లేక గ్రామీణ ప్రజలు మృత్యువార్త పడుతున్నట్లు పేర్కొన్నారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ప్రభుత్వ అధికారులు, మైనింగ్ అధికారులందరూ కలిసి వెంగమాంబ క్వారీ యాజమాన్యం శ్రీనివాస్ చౌదరికే కొమ్ము కాస్తుంటే ఎవరికీ చెప్పుకోవాలో తెలియక.. దిక్కుతోచని స్థితిలో ఆ గ్రామాల ప్రజలు ఉన్నారన్నారు. ఈ క్వారీని తక్షణమే నిలిపేయాలని లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వియ్యపు రాజు హెచ్చరించారు.



వెంగమాంబ క్వారీని పరిశీలిస్తున్న సీపీఐ నేత వియ్యపు రాజు

వేళాపాళా లేని విధులు

- గ్రామ సచివాలయాల్లో అందుబాటులో లేని ఉద్యోగులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్‌లు లేకపోవడంతో తాళం వేసిన గది

పాయకరావుపేట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లి వ్యయప్రయాసలకు లోనుకాకుండా ఉండడం కోసం ప్రతీ గ్రామంలో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఆయా శాఖలకు సంబంధించిన 11 మంది సిబ్బందిని నియమించింది. 400 ప్రజా



గోపాలపట్నం సచివాలయంలో కార్యదర్శి లేకపోవడంతో ఖాళీగా కుర్చీ

సేవలందించేవారు. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామంలోనే సమస్యలు పరిష్కరించేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ సచివాలయానికి కార్యదర్శితోపాటు వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు, ఆరోగ్య శాఖ సిబ్బంది విధులు నిర్వహించే విధంగా క్రమబద్ధీకరించింది. కానీ గ్రామ సచివాలయాలు పలు గ్రామాల్లో తెరవకపోవడం, సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

గోపాలపట్నం గ్రామ సచివాలయంలో ఇదీ పరిస్థితి

మండలంలో 25 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. పలు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సమయానికి కార్యాలయాలు తెరవకపోవడం, కార్యాలయాలు తెరచినప్పటికీ సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండకపోవడంతో సంక్షేమ పథకాలతో పాటు పలు సమస్యలపై దరఖాస్తులు చేసుకునే ప్రజలు, రైతులు, ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి గోపాలపట్నం గ్రామ సచివాలయంలో నెలకొంది. ఇక్కడ కార్యదర్శితోపాటు సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని పలువురు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ



గోపాలపట్నం గ్రామ సచివాలయం

కోసం రైతులు పాస్ పుస్తకాలు, రికార్డులు తీసుకెళ్తున్నప్పటికీ కార్యదర్శి గాని, వెల్ఫేర్ అసిస్టెంట్ గాని అందుబాటులో ఉండడం లేదని వాపోతున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించవలసిన సిబ్బంది కార్యాలయంలో లేకపోవడంతో ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి సిబ్బంది సకాలంలో సచివాలయంలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు ఏమన్నారంటే...

ఈ విషయమై గ్రామ సచివాలయ కార్యదర్శి సత్యనారాయణను సంప్రదించగా తాము కార్యాలయం పనులపై బయటకు వెళ్లాల్సి వస్తుందని, అందువల్లే సచివాలయంలో ఉండడానికి కుదరడం లేదన్నారు. సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సక్రమంగా విధులు నిర్వహించడం లేదన్నారు. ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావును సంప్రదించగా సచివాలయాలపై దృష్టి సారించామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది సచివాలయంలో ప్రజలకు అందుబాటులో వుండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

పేదరిక నిర్మూలనకు పాటుపడాలి

మునగపాక: పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వాడ్రాపల్లి పంచాయతీ కార్యదర్శి త్రినాథరావు కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో శనివారం పాలకవర్గంతోపాటు గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ–4 సర్వేలో లోపాలుంటే వాటిని సరిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. పేదరిక నిర్మూలనలో రాజకీయాలకు అతీతంగా సహకరించాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, మళ్ల శేషు, ఆడారి బాలాజీ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు



బదిలీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి తెలిపారు. మునగపాక మండలంలో ఎనిమిది సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లడంతో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందన్నారు. ఎంతోమంది పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ఎంతగానో కష్టపడతారన్నారు. ఉద్యోగులకు బదిలీలు సాధారణమన్నారు. తహసీల్దార్ పి.సత్యనారాయణ, ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, ఉపాధ్యాయులు పెంటకోట సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎంవై రాము, శంకర్, విజయవాణి, రామ్మోహన్, సోమశేఖర్, గోవింద, సూరప్పారావు, జగదీష్, సీఆర్ఎంటీలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్

మునగపాక: విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని సైకాలజిస్టు జయ శ్రీరావు పేర్కొన్నారు. ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలని ఆకాంక్షించారు. తిమ్మరాజుపేట ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్(తోసా) ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మరాజుపేటలో శనివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చదువులో ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. ప్రణాళికాపరంగా చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై దృష్టి సారించాలన్నారు. పిల్లల నడవడికపైనా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. పిల్లలకు స్టడీ మెటీరియల్, నోట్ బుక్స్ అందజేశారు. తోసా అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఉపసర్పంచ్ కాండ్రేగుల జగన్, తోసా ప్రతినిధులు దాడి దుర్గారావు, మళ్ల అప్పలనాయుడు, వెంకటరెడ్డి నాయుడు, జగన్, దివాకర్, నాగ మాణిక్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

చినదొడ్డిగల్లు హైస్కూల్లో రెడ్ డే వేడుక

నక్కపల్లి: చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం రెడ్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం బాలాజీ, రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ వ్యవస్థాపకుడు, ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎరుపు రంగు దుస్తులతో విద్యార్థులు అదే రంగు బెలూన్లపై ఇంగ్లిష్ పదాలు రాసి ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హెచ్ఎం బాలాజీ తెలిపారు. ఈ పదాలు, స్లోగన్స్ రాయడంలో తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయిని సునీతను అభినందించారు. సులభమైన రీతిలో ఆంగ్లాన్ని బోధించేందుకు, నేర్చుకునేందుకు ఈ ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి శనివారం ఇటువంటి కార్యక్రమాలు ప్రత్యేకంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాంబశివరావు, ప్రసాద్, ప్రసన్న, పద్మ, మణికుమార్, రజని గ్రంథాలయాధికారి జనార్దన్ పాల్గొన్నారు.



ఎరుపు రంగు బెలూన్లపై ఇంగ్లిష్ పదాలు రాసి ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విద్యుదాఘాతంతో చూడిగేదె మృతి

కోటవురట్ల: మండలంలోని జానకిరాంపురంలో విద్యుదాఘాతంతో చూడి గేదె మృతి చెందింది. రైతు గోవిందు తన గేదెను మేపేందుకు మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజుకు చెందిన ఆయిల్‌పామ్ తోటలోకి తోలుకెళ్లాడు. అప్పటికే తెగి పడి ఉన్న విద్యుత్ తీగెలను గేదె తాకడంతో షాక్‌కు గురై చనిపోయింది. వెంటనే అప్రమత్తమైన రైతు దూరంగా ఉండిపోవడంతో అతడికి ప్రాణాపాయం తప్పింది. మృతి చెందిన చూడి గేదె విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక్కడ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండడంతో ఆ శాఖాధికారులకు ఆరు నెలల క్రితమే ఫిర్యాదు చేసినట్టు మాజీ ఎమ్మెల్సీ తెలిపారు. అయినా పట్టించుకోలేదని వాపోయారు. తోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బయట ఏర్పాటు చేయాలని, రైతుకు పరిహారం అందించాలని కోరారు.



మృతి చెందిన చూడిగేదె

ఆర్టీసీ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వరాదు

అనకాపల్లి: గవర్నర్‌పేట–2 ఆర్టీసీ డిపో స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే నిర్ణయాన్ని తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు శనివారం డిపో గేటు వద్ద ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో కార్యదర్శి కె.ఎస్.వి.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడం వల్ల రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక

చోడవరం: ఇతర జిల్లా నుంచి బదిలీపై చోడవరం వచ్చిన 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. హరినారాయణను పోలీసు అధికారులు మర్యాద పూర్వంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు అప్పలరాజు, కోటేశ్వరరావు పుష్పగుచ్ఛాలు అందజేశారు.